సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



క్రీడా సందడి

పాఠశాల, కళాశాల స్థాయిల్లో ఎస్‌జీఎఫ్ క్రీడల సందడి ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



శ్వేతారెడ్డికి అశ్రునివాళి

మాజీమంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మృతిపై పలువురు అశ్రునివాళి అర్పించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /22.9

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండనుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి పాస్ అయిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6303430789 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ధరూరు: ఎనిమిది నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడారు. వేల మంది మల్టీపర్పస్ కార్మికులుగా పనిచేస్తున్నారని, అలాంటి కార్మికులకు వేతనాలు సక్రమంగా అందించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ ఖాన్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో శంకర్, సవారన్న, నాగన్న, పద్మమ్మ, లచ్చమ్మ, హనుమంతు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించిన ఎస్ఈ



కేటీదొడ్డి: మండల పరిధిలోని కొండాపురంలోని మిషన్ భగీరథ వాటర్ కొన్ని వార్డులకు మాత్రమే వస్తున్నాయి. కొన్ని వార్డులకు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట్రాములు గ్రామాన్ని సందర్శించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించి గ్రామస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిని వదలాలని, గ్రామంలోని పంచాయతీకి సంబంధించిన బోరుమోటార్లను మరమ్మతు చేసి వాటర్ ట్యాంక్ కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. వారి వెంట ఏఈ జాకీర్, ఇంజినీర్ బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

ఎల్కూరు చెరువును పరిశీలించిన డీఈ..

మల్దకల్: మండలంలోని ఎల్కూరు గ్రామ సమీపంలోని చెరువును మంగళవారం నీటిపారుదల శాఖ డీఈ ఇమ్మానియేల్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు అలుగు పారుతుంది. చెరువు అలుగు వద్ద నీరు ముందుకు వెళ్లకుండా మధ్యలో పిచ్చిమొక్కలు పెరిగాయి. వాటిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట గ్రామస్తులు ఉన్నారు.

ముందుంది ముప్పు!



బుర్దపేటకు వెళ్లే దారిలో డ్రైయినేజీ, కందకాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

ఆక్రమణకు గురవుతున్న డ్రైయినేజీలు, కందకాలు

- భారీ వర్షాలు కురిస్తే జలమయం కానున్న కాలనీలు
- అనుమతులకు విరుద్ధంగా అడ్డగోలు నిర్మాణాలు
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- పట్టణవాసులకు తప్పని కష్టాలు

గద్వాలటౌన్: భారీ వర్షాలకు హైదరాబాద్, ఖమ్మం నగరాల్లోని కాలనీలు, ఇళ్లు నిండా మునిగి జనం అతలాకుతలమయ్యారు. అలాంటి పరిస్థితి జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు రానుంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఆయా పట్టణాలు పూర్తిగా నీటమునిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రోజూ కురుస్తున్న వర్షాలకు కూడా పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు వచ్చి చేరే అవకాశం ఉంది.

జిల్లా కేంద్రం ఆగమాగం..

చారిత్రక పట్టణం, వాణిజ్యపరంగా విరాజిల్లుతున్న జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణం కబ్జాలకు చిరునామాగా మారుతోంది. కందకాలు, డ్రైయినేజీల స్థలాలపై ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. హద్దులు చెరిపేసి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం గద్వాలలో కందకాలు, డ్రైయినేజీల ఆక్రమణలతో ముప్పు పొంచి ఉంది. ఎందుకంటే ఇక్కడ నాలాల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. అనుమతులకు విరుద్ధంగా అడ్డగోలు నిర్మాణాలు చేపట్టడం భవిష్యత్ ప్రమాదాన్ని కొనితెచ్చేలా ఉంది. గద్వాలలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిస్తే కాలనీలు జలమయం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

● 2007, 2009లో కురిసిన భారీ వర్షాలకు గద్వాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతంలోని కాలనీలు సైతం జలమయం అయ్యాయి. చారిత్రక గద్వాల పట్టణంలో కందకాల పాత్ర ఎంతో కీలకం. గతంలో పట్టణాన్ని పాలించిన కాలంలో రక్షణ కోసం పట్టణం చుట్టూ కందకాలను నిర్మించారు. సుమారు 50 అడుగుల వెడల్పు, 30 అడుగులకు పైగా లోతుతో ఉండే ఈ కందకాల్లో ఎప్పుడూ నీటిని నింపి అందులో మొసళ్లను ఉంచేవారని చరిత్ర చెబుతోంది. అయితే కాలక్రమేణా పట్టణం విస్తరిస్తుండటంతో ఒకప్పుడు పట్టణం చుట్టూ ఉన్న కందకాలు ప్రస్తుతం పట్టణం నడిబొడ్డుకు చేరాయి. కొంతమంది అక్రమార్కులు స్వార్థంతో ఈ కందకాల స్థలాలను ఆక్రమించుకొని స్వాధీనం చేసుకున్నారు. 50 అడుగుల వెడల్పుతో ఉన్న కందకాలు ఐదారు అడుగులకు కుదించుకుపోయాయి. కొన్నిచోట్ల ఇవన్నీ ఆనవాళ్లను సైతం కోల్పోయాయంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.



అశోక్‌నగర్ కాలనీ వెనుక కందకంలో నిర్మించిన ఇంటి నిర్మాణం

గతంలో నిర్మించినవే..



కందకాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన విషయం వాస్తవమే. అయితే ఆ నిర్మాణాలన్నీ గతంలో నిర్మించినవే. ప్రస్తుతం ఎలాంటి అక్రమ నిర్మాణాలు కందకాలపై చేపట్టలేదు. ఏవైనా నిర్మించినట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. డ్రైయినేజీ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం.

– బీఎస్ కేశవ్, మున్సిపల్ చైర్మన్, గద్వాల

ప్రణాళికతోనే కాపాడుకోవచ్చు..



దీర్ఘకాలిక ప్రణాళికతోనే వరద ముప్పు నుంచి పట్టణాలను కాపాడుకోవచ్చు. పట్టణం నలుదిశల నుంచి వరద ఏ మేరకు వస్తుందనే వివరాలు గ్రహించాలి. ఆ మార్గంలోని నాలాల కబ్జాలను తొలగించి శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టాలి. అందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. మాస్టర్ ప్లాన్ మేరకు శాశ్వత పనులు చేపడితే సత్ఫలితాలు వస్తాయి. ప్రభుత్వ స్థలాల కబ్జాలపై న్యాయపోరాటం చేస్తున్నాం.


– రామలింగేశ్వర కాంప్లే, గద్వాల ప్రజా ఆస్తుల పరిరక్షణ సమితి సభ్యుడు, గద్వాల

ఇక్కడ అదే పరిస్థితి...

2009లో వచ్చిన వరదలతో అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పట్టణాలు జలదిగ్బంధమయ్యాయి. అలంపూర్ పట్టణం మొత్తం పూర్తిగా నీటితో మునిగింది. వడ్డేపల్లి పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఆ చేదు జ్ఞాపకాలు, వరద ఆనవాలు ఇంకా కళ్ల ముందే ఉన్నాయి. అయిజలో ఉన్న పెద్ద వాగు పొంగిపొర్లింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పెద్దవాగు సైతం కొన్ని చోట్ల ఆక్రమణలకు గురైంది.

నాలాలు కనుమరుగు..

కళ్లముందే ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. నాలాలపై నిర్మాణాలతో పాటు ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఇళ్లలోకి నీరు చొరబడే పరిస్థితి ఏర్పడింది. ఆక్రమణలను తొలగించడం, అడ్డుకోవడం చేయాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదు.



గంజిపేటకు వెళ్లే దారిలో కబ్జాకు గురైన కందకం

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

కేటీదొడ్డి: క్షేత్రస్థాయి ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలో క్షుణ్ణంగా పరిశీలిస్తామని డ్వామా పీడీ, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని 3వ విడత సామాజిక ప్రజావేదిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలోని 2023–24 సంవత్సరానికి జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు రూ.4.18 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. సంబంధిత పనుల వివరాలను గ్రామపంచాయతీల వారీగా సర్వే చేసిన నివేదిక సోషల్ ఆడిట్ బృందం వారు పంచాయతీ గ్రామాల వారీగా ప్రజావేదికలో చదివి వినిపించారు. సర్వేలో వచ్చిన తప్పులను సరిదిద్దుకోవాలని మాస్టర్ ఎంఎస్ఎస్ఎస్ నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 23 గ్రామపంచాయతీలకు గాను జరిగిన పనులపై ఆడిట్ నిర్వహించగా.. రూ.1,93,000 రికవరీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారులు శ్రీనివాస్‌రావు, అశోక్, ఎస్ఆర్‌పీ మహేష్, పంచాయతీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్‌జూనియర్ ఖోఖో ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని కర్నెలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా ఖోఖో బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విలియం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో వచ్చే బాలబాలికలు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల బోనఫైడ్, 4 పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఎంపికయ్యే బాలబాలికల జట్లు హైదరాబాద్‌లో 13న జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 9121472479, 9985904158 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు ఎస్సీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్సీ గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు గురువారం స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులు మాత్రమే సర్టిఫికెట్లతో జడ్చర్ల చిట్టిబోయిన్‌పల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణే లక్ష్యం

మల్దకల్: బాలల హక్కుల పరిరక్షణ, భద్రతే ప్రధాన లక్ష్యమని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం పెద్దొడ్డి, అమరవాయి, పాల్వాయి గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ కమిటీలకు అవగాహన కల్పించారు. అలాగే గృహహింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమ రవాణా, అమ్మకం, లైంగిక వేధింపులు వంటివి చట్టరీత్యా నేరమని తెలియజేశారు. మహిళలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ఆపద వచ్చినా.. వెంటనే 1098కు డయల్ చేయాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యంపై దృష్టి

- సరైన యాక్షన్ ప్లాన్‌తో మూడు నెలల్లో కట్టడి చేస్తాం
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సారా, అక్రమ మద్యం కట్టడి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేసి మరో రెండు, మూడు నెలల్లో పూర్తిగా నివారిస్తామని రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా కాకుండా నిఘా పెంచామని ఈ ఏడాది కృష్ణ చెక్‌పోస్టులో 15 కేసులు నమోదు చేసి 185 బాటిళ్లు సీజ్ చేయగా, నందిన్నె చెక్‌పోస్టులో 8 కేసులు నమోదు చేసి 26 మందిని అరెస్టు చేశామని, గతేడాది కృష్ణా చెక్‌పోస్టులో 89 కేసులు నమోదు చేసి 26 మందిని అరెస్టు చేసి 1,418 బాటిళ్లు సీజ్ చేసినట్లు వెల్లడించారు. నందిన్నెలో 38 కేసులు నమోదు చేశామన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి సారా, లిక్కర్, గంజాయి కేసులు అధికంగా ఉన్నట్లు గుర్తించామని ఆ దిశగా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీనికోసం ఉమ్మడి జిల్లాలో రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. స్థానికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మరింత బలోపేతం చేసి కల్తీ కల్లు, సారా, అక్రమ, నకిలీ మద్యం పూర్తిగా కట్టడి చేస్తామన్నారు. ఈ ఏడాది బెల్ట్ కేసులు 254 నమోదు చేశామని, దాబాల్లో జరుగుతున్న మద్యం విక్రయాల్లో సైతం పర్యవేక్షణ పెంచుతామన్నారు.

డ్రగ్స్ వినియోగం తక్కువే..

ఇతర జిల్లాలో పోలిస్తే ఉమ్మడి పాలమూరులో డ్రగ్స్ వినియోగం తక్కువగా ఉందని, సారాతో పాటు డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని కమలాహసన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14ఎక్సైజ్ పోలీస్ అధికారులు ఈఎస్‌లు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారా, కల్తీ కల్లు తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వాటిని కట్టడి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల మద్యం కట్టడి కోసం కృష్ణా, నందిన్నె చెక్‌పోస్టుల దగ్గర భద్రతతోపాటు పూర్తిస్థాయిలో నిఘా కొనసాగించాలన్నారు. ఉమ్మడి పాలమూరులోని రెండు జిల్లాల్లో సారా పూర్తిగా లేకుండా చేశామని, మరో మూడు జిల్లాల్లో త్వరలోనే కట్టడి చేయాలన్నారు. సారా, డ్రగ్స్ అరికట్టడానికి పోలీసులతో కలిసి దాడులు నిర్వహించాలని చెప్పారు. హైదరాబాద్‌లోని దూల్‌పేట్ ఏరియాలో గత నెల రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చాలామందిని జైలుకు తరలించామన్నారు. సారా తయారీకి అవసరమైన బెల్లం, ఇతర పదార్థాలు, కల్లు తయారీకి ఉపయోగించే ఆల్ప్రాజోలం నియంత్రించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషి, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఈఎస్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు చెందిన శ్రీను తనకున్న మూడెకరాల్లో వరిపంట సాగుచేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు సమీపంలోని కేఎల్ఐ కాల్వకు గండిపడి ఎకరా పొలం నీట మునిగింది. మరో ఎకరాన్నర పొలంలో ఇసుక మేటలు వేసింది. కేఎల్ఐ కాల్వపై ఇదే ప్రాంతంలో ఇప్పటికే ఆరుసార్లు గండి పడిందని రైతు చెబుతున్నాడు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా మరమ్మతు, కాల్వ కట్టను పటిష్టం చేయడం లేదని వాపోయాడు. నష్టపోయిన పంటకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నాడు.'



'వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం దావాజీపల్లికి చెందిన రైతు కృష్ణయ్యగౌడ్ మూడెకరాల్లో వరిపంట సాగు చేశాడు. సమీపంలోని కేఎల్ఐ కాల్వకు కోత పడటంతో కృష్ణయ్యకు చెందిన పొలమంతా నీటిలో కొట్టుకుపోయింది. నీటి ప్రవాహం ఉధృతికి వరిపంట నామరూపాలు లేకుండా బురదతో నిండిపోయింది. పంట సాగుకోసం ఇప్పటికే రూ.లక్ష ఖర్చు చేశానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.'

ఆశలకు 'గండి'



వనపర్తి జిల్లా రేవల్లి సమీపంలోని డీ–5 కాల్వ తెగి పొలాల్లోకి వస్తున్న కేఎల్ఐ నీరు

- కేఎల్ఐ కాల్వల నిర్వహణ మరిచిన అధికారులు
- ఇటీవల వర్షాలకు కోతలకు గురైన వైనం
- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని పలుచోట్ల కొట్టుకుపోయిన దుస్థితి
- కల్వకుర్తి మండలంలోనే నాలుగు చోట్ల కాల్వకు కోతలు
- నీట మునగడంతో పంటలను నష్టపోయిన రైతులు

సాక్షి ఫోకస్

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన సాగునీటి కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కేఎల్ఐ ఎత్తిపోతల పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 ఏళ్లుగా కాల్వల మరమ్మతుకు నోచుకోవడం లేదు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు కనీసం కాల్వల నిర్వహణ సైతం చేపట్టడం లేదు. ఫలితంగా అన్నిచోట్ల కాల్వలు బలహీనంగా మారి.. చిన్నపాటి వరదకే తెగిపోతున్నాయి. వర్షం పడితే చాలు కాల్వలకు గండ్లు పడి.. నీరంతా రైతుల పొలాలను ముంచెత్తుతోంది. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలవుతోందని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

అడుగడుగునా గండ్లతో తీవ్రనష్టం..

వర్షాలు కురిసిన సమయంలో కేఎల్ఐ కాల్వల పొడవునా పలుచోట్ల గండ్లు పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలో చాలాచోట్ల కాల్వ కోతకు గురైంది. ఒకే మండలంలో ఐదారు చోట్ల కాల్వకు గండి పడటంతో ఆయా మండలాల్లో పంటల నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే పంట నష్టంపై అధికారులు స్పందించడం లేదని, కనీసం వివరాలు కూడా తీసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. కల్వకుర్తి మండలం తోటపల్లి, వెంకటాపూర్, తిమ్మరాసిపల్లి, నెల్లికట్ల గ్రామాల సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండి పడి పంటలు నీటిలో మునిగాయి. వెల్దండలో కాల్వకు గండిపడటంతో సమీపంలోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

■ వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కేఎల్ఐ కాల్వలతోపాటు భీమా కాల్వకు పలుచోట్ల గండి పడటంతో రైతులు పెద్దసంఖ్యలో నష్టపోయారు. ఈ మండలంలోని దావాజీపల్లి, బండపల్లి, షాగాపూర్, జమ్మాపూర్, మందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలో కాల్వలకు గండిపడగా రైతుల పొలాలు నీటిలో కొట్టుకుపోయి.. ఎక్కడ చూసినా ఇసుక మేటలే దర్శనమిస్తున్నాయి. రేవల్లి సమీపంలోని డీ–5 లింక్ కెనాల్ తెగడంతో పంటలు నీట మునిగాయి.

పదేళ్లలో ఒక్కసారి కూడా..

కేఎల్ఐ కాల్వల నిర్మాణం 2005లో చేపట్టగా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం మరమ్మతు, నిర్వహణకు నోచుకోవడం లేదు. ప్రతిసారి వేసవిలో కాల్వలకు మరమ్మతు చేపట్టి.. కట్టలను పటిష్టం చేయాల్సిఉండగా, గడిచిన పదేళ్లలో ఒక్కసారి కూడా మరమ్మతు చేపట్టలేదు. కేఎల్ఐ కింద కేవలం చెరువులు, కుంటలు నింపడం, ఉన్న కొద్దిపాటి కాల్వలకు సాగునీరందించేందుకే అధికారులు పరిమితం అవుతున్నారు. పంపు హౌస్‌ల్లో రిపేర్‌లో ఉన్న మోటార్లకు కూడా మరమ్మతు చేయకపోవడంతో సరైన స్థాయిలో పంపింగ్ చేపట్టక చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు.

పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లిలో నీటమునిగిన పంట చూపుతున్న రైతు ఉపేందర్



లైనింగ్ లేకపోవడమే కారణం

కేఎల్ఐ కాల్వలకు తరుచుగా గండ్లు పడటానికి, కాల్వల కట్టలు కోతకు గురవడానికి కాల్వలకు లైనింగ్ చేపట్టకపోవడమే కారణమని రైతులు పేర్కొంటున్నారు. కాల్వలకు ఇరువైపులా సిమెంట్ లైనింగ్ చేపట్టకపోవడంతో తరచుగా కోతలకు గురవుతున్నాయి. కేవలం ఎల్లూరు నుంచి సింగోటం వరకు మాత్రమే కేఎల్ఐ ప్రధాన కాల్వకు లైనింగ్ పనులు చేసి ఆ తర్వాత కాల్వల నిర్వహణ గాలికి వదిలేశారు. ప్రభుత్వం దృష్టిసారించి కేఎల్ఐ కాల్వలకు మరమ్మతు చేపట్టడంతోపాటు లైనింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎకరా పొలం నీటిపాలైంది..



నాకున్న రెండు ఎకరాల్లో వరిసాగు చేశాను. కేఎల్ఐ కాల్వకు గండిపడటంతో నీరంతా పంట పొలాలను ముంచెత్తింది. నా ఎకరం పొలం కాల్వ నీటిలో పూర్తిగా కొట్టుకుపోయింది. ఇప్పటికే సాగుఖర్చుల నిమిత్తం రూ.30 వేల వరకు ఖర్చు అయ్యింది. చేసిన కష్టమంతా నీటిపాలైంది. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలి. – దేరంగుల అర్జునయ్య, రైతు, తోటపల్లి, కల్వకుర్తి మండలం

ప్రతిసారి ఇలాగే..



నాకున్న ఎకరాన్నర భూమిలో వరిపంటను సాగుచేశాను. రేవల్లి సమీపంలోని పెద్దగట్టు వద్ద డీ–5 లింకు కెనాల్ కాల్వ బలహీనంగా ఉంది. ప్రతిఏటా ఇదే ప్రాంతంలో కాల్వ తెగిపోతోంది. గతంలో కాల్వ కట్ట తెగినా అధికారులు బాగుచేయలేదు. ప్రతిసారి కాల్వ తెగి చాలా నష్టపోతున్నాం. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతు చేపట్టాలి.

– వంకేశ్వరం నాగయ్య, రైతు, రేవల్లి, వనపర్తి జిల్లా

మరమ్మతు చేపడతాం..

ఇటీవల వర్షాలతోపాటు వరద నీరు ఎక్కువ కావడంతో కేఎల్ఐ కాల్వలకు అక్కడక్కడా గండ్లు పడ్డాయి. వెంటనే గుర్తించి కాల్వలకు గండిపడ్డ చోట్ల అడ్డుకట్ట వేస్తున్నాం. త్వరలోనే కాల్వలకు మరమ్మతు చేపడతాం. కాల్వలకు పూర్తిస్థాయిలో లైనింగ్ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. – శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

ధీరవనిత చాకలి ఐలమ్మ

గద్వాల: రాష్ట్ర సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చాకలి ఐలమ్మ చూపిన బాటలో ప్రజలందరూ కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వీరభద్రప్ప, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు

క్లుప్తంగా

వృద్ధురాలి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం గుర్తుతెలియని వృద్ధురాలు (60) మృతిచెందింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వివరాల మేరకు.. కొన్ని రోజులుగా జిల్లా జనరల్ ఆస్పత్రి వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

గుర్తుతెలియని మహిళ..

భూత్పూర్: మండలంలోని కొత్తమొల్గర శివారు తుల్జాభవానీతండా సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మహిళ(50) మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. కొత్తమొల్గర గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు తుల్జాభవానితండా సమీపంలో పనులు చేస్తుండగా మహిళ ఆకలి.. అని కేకలు వేస్తుండగా శబ్దం విని ఆమె వద్దకు వెళ్లారు. కూలీలు తెచ్చుకొన్న మంచినీళ్ల బాటిల్‌తో నీరు తాగించిన కొద్దిసేపటికే ఆమె మృతిచెందింది. భూత్పూర్, కొత్త మొల్గర గ్రామాల్లో మతిస్థిమితం లేకుండా తిరిగేదని, ఆహారం లేకపోవడంతో మృతిచెందిందని కూలీలు తెలిపారని ఎస్ఐ చెప్పారు. ఈ ఘటనపై ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బాలమాసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంతన్‌గోడ్‌లో పట్టపగలు చోరీ

మక్తల్: మంతన్‌గోడ్‌లో మంగళవారం పట్టపగలు దొంగతనం జరిగిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి ఇంటికి కుటుంబ సభ్యులు తాళం వేసి తమ తమ పనుల మీద వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి 3 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ. లక్ష ఇరవై వేల నగదు ఎత్తుకెళ్లారు. కాగా సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి చేరుకున్న చిన్నారులు.. ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో తండ్రి సుదర్శన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఈ మేరకు మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డిలకు తెలియజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జూరాలకు మరింత తగ్గిన వరద


జూరాల వద్ద దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గింది. మంగళవారం సాయంత్రానికి 1,35,00 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 11 గేట్ల ద్వారా 76,710 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 32,410 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 650, ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు 160 క్యూసెక్కులు వదలగా.. మరో 45 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.591 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 76,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 60,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 65,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 19 గేట్ల ద్వారా 49,851 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. మంగళవారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 277.265 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు.

సుంకేసులలో 8 గేట్లు..

సుంకేసులకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం ఎగువ నుంచి 36,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 8 గేట్ల ద్వారా 33,633 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నాటికి పూర్తి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

క్రీడా సందడి


మహబూబ్‌నగర్‌లో గతేడాది జరిగిన ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీ (ఫైల్)

- 20 క్రీడాంశాల్లో ఎస్‌జీఎఫ్ పోటీలు
- మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నీలు
- జిల్లా, ఉమ్మడి స్థాయిల్లో 17 క్రీడాంశాల్లో సెలక్షన్స్
- అండర్– 19 విభాగానికి జాతీయస్థాయి టోర్నీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాఠశాల, కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఒక క్రీడావేదికగా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్– 14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలను క్రీడల్లో ప్రోత్సహించడం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది త్వరలోనే పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఎస్‌జీఎఫ్ క్రీడల సందడి నెలకొననుంది.

జిల్లాస్థాయిలో పీఈటీల సమావేశం

జిల్లాస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణపై గత నెల 27న స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల గాంధీహాల్‌లో మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్ అధ్యక్షతన జిల్లాలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఇందులో ఈ ఏడాది జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలపై డీఈఓ దిశానిర్దేశం చేశారు. ఎస్‌జీఎఫ్ క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా విద్యార్థులు గెలుపొందేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాలో ఈ నెల చివరి వారం నుంచి అండర్– 19 ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలు నిర్వహిస్తాం. ఈ క్రీడలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన జాతీయ, రాష్ట్రస్థాయి టోర్నీలను విజయవంతంగా జరుపుతాం.

– పాపిరెడ్డి, అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

విద్యార్థులు ప్రతిభచాటాలి



పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడావేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభచాటాలి. ప్రతి ఏడాది జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు రాణించాలి.

– వేణుగోపాల్, సీనియర్ పీడీ, చిన్నదర్పల్లి, మహబూబ్‌నగర్

ముందుగా మండల స్థాయిలో..

మండల, జిల్లాస్థాయి, జోనల్ (ఉమ్మడి జిల్లా) స్థాయిల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. 20 క్రీడాంశాల్లో ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు జరగనున్నాయి. మొదటగా మండల స్థాయిలో ఈ నెల 15వరకు నిర్వహించనుండగా ఇప్పటికే కొన్ని మండలాల్లో క్రీడలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా జిల్లాస్థాయిలో ఈ నెల 25 వరకు ఉమ్మడి జిల్లా (జోనల్) స్థాయిలో చివరివారం నుంచి అక్టోబర్ మొదటి వారం వరకు ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. మండల స్థాయిలో గ్రామీణ క్రీడలైన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో టోర్నీ కం సెలక్షన్స్ నిర్వహించనున్నారు. మండల స్థాయిలో విన్నర్ జట్లు జిల్లాస్థాయి టోర్నీలో పాల్గొంటాయి. అదేవిధంగా ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కరాటే, రగ్బీ, తైక్వాండో, నెట్‌బాల్, క్రికెట్, సాఫ్ట్‌బాల్, చెస్, యోగా, బాక్సింగ్ క్రీడాంశాలతోపాటు ఇతర క్రీడల్లో జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయిల్లో సెలక్షన్స్ నిర్వహించనున్నారు.

- జూనియర్ కళాశాలస్థాయిలో కూడా ఎస్‌జీఎఫ్ క్రీడల సందడి నెలకొననుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్– 19 విభాగం ఉమ్మడి జిల్లా ఎంపికలు ఈ నెల చివరి వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు అండర్– 19 జాతీయ స్థాయి బాలుర క్రికెట్ టోర్నీ నిర్వహించన్నారు. అదేవిధంగా అండర్– 19 జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీ కూడా జిల్లాకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించి రాష్ట్రస్థాయి టోర్నీలతోపాటు అండర్– 19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ కూడా ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్నారు.

రాజ్యాధికారం లక్ష్యంగా సాగుదాం..


సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్‌ముదిరాజ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ జనాభాలో సగ భాగం ఉన్న ముదిరాజ్‌లు రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగుదామని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్‌ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కాళికాంబ కల్యాణ మండపంలో ముదిరాజ్ మహాసభ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా మన ఆలోచన విధానం మారాలన్నారు. సంఘం నిర్మాణంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్‌ల ఆలోచనలు, సోషల్ మీడియా పోకడలు అంచనా వేసేందుకు, సంఘం నిర్మాణంతో పాటు ముదిరాజ్‌ల హక్కుల సాధన, ఆర్థిక చైతన్యం రాజ్యాధికారం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ముదిరాజులు జనాభాలో అత్యధిక శాతం ఉన్నప్పటికీ, రాజ్యాంగ ఫలితాలు అనుభవించక వెనుకబడిపోయామన్నారు. ప్రతిఒక్కరూ కచ్చితంగా ఓటును నమోదు చేసుకోవాలని, మన ఓటు మనం వేసుకోవాలన్నారు. చట్టసభల్లో ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రామ్‌శ్రీనివాస్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందని.. అధ్యాపకుడు కిషోర్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఆయనకు అధ్యాపకులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. 2009లో యూనివర్సిటీలో ఉద్యోగం పొందిన నాటి నుంచి ఏ బాధ్యతలను అప్పగించినా నిబద్ధతతో పూర్తి చేసినట్లు వివరించారు. పరిశోధనలపై ఎక్కువగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అవార్డు ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కిషోర్‌కు అవార్డు రావడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాజ్‌కుమార్, పీజీ కళాశాల పిన్సిపాల్ చంద్రకిరణ్, బషీర్ అహ్మద్, నూర్జహాన్, అంకం భాస్కర్, కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి, నాగసుధ తదితరులు పాల్గొన్నారు.

పే..ద్ద జొన్న



సాధారణంగా జొన్న మొక్క 6 నుంచి 8 అడుగుల వరకు ఉంటుంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో మాత్రం ఓ జొన్న మొక్క 15 అడుగులకు పైగా పెరిగి అందరినీ అబ్బుర పరుస్తోంది. ఎవరికీ అందనంత ఎత్తులో కంకితో ఉన్న జొన్న చెట్టు చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. – ఉండవెల్లి

ముందుకు సాగేనా..!


బీటీ వేయకపోవటంతో వస్తున్న దుమ్ము


బ్రిడ్జ్ వేయాల్సిన రైల్వేలైన్

- తాత్కాలికంగా నిలిచిన 167వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు
- ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే అనుమతులకు ఎదురుచూపులు
- పది రోజులు వర్షాలు పడకుండా ఉంటేనే ప్రస్తుత రోడ్డుకు బీటీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 167వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. పనులు ఎన్నటికి పూర్తవుతాయోననే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. రైల్వేట్రాక్‌పై ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వేశాఖ అనుమతులు పొందాల్సి ఉండటం.. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో చేసేదేమి లేక పనులు నిలిపివేశారు. పదిరోజుల పాటు వర్షాలు పడకుండా ఎండలు కాస్తేనే విస్తరణ చేసిన రోడ్డుపై బీటీ వేసేందుకు అవకాశం ఉంటుంది. అప్పటి వరకు పనులు ముందుకు సాగేలా లేవు. రాయచూర్ నుంచి కోదాడ వరకు ఉన్న 167వ నంబరు జాతీయ రహదారిపై మున్సిపాలిటీ పరిధిలో 750 మీటర్ల మేర పనులు ఆలస్యంగా ప్రారంభమైన సంగతి పాఠకులకు విధితమే. పనులు మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. సిగ్నల్‌గడ్డ రైల్వేలైన్‌కు ఇరువైపులా విస్తరణ పనులు చేపట్టారు. రైల్వేలైన్ మీద బ్రిడ్జ్ నిర్మాణం చేయాల్సి ఉంది. అందుకు గాను ఒకమార్గంలో ఇరువైపులా ఇప్పటికే ఆర్‌యూబీలు నిర్మించి బ్రిడ్జ్ వేసేందుకు కావాల్సిన పిల్లర్లు సైతం పూర్తిచేశారు.

అనుమతులకు ఎదురుచూపులు

దక్షిణమధ్య రైల్వేలో ప్రాధాన్యత కలిగిన రైల్వేలైన్ కావటంతో రెండేళ్ల కిందటే విద్యుత్ రైళ్ల రాకపోకలు ప్రారంభించారు. ఈ కారణంగా 2వేల మెగావాట్స్ కరెంట్ సరఫరా అయ్యే విద్యుత్ లైన్లు ఈ మార్గంలో ఉన్నాయి. వాటిపై బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలంటే రైల్వేశాఖ అనుమతులు తప్పనిసరి. ఈ మేరకు రైల్వేశాఖకు జాతీయ రహదారుల శాఖ లేఖలు పంపింది. లేఖలు స్వీకరించిన దక్షిణమధ్య రైల్వేశాఖ విద్యుత్‌లైన్ మార్పు చేసేందుకు టెండర్లు పిలిచింది. టెండరు ప్రక్రియ పూర్తికావటానికి మరికొద్ది రోజులు పట్టే అవకాశం ఉంది. ప్రక్రియ పూర్తయి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు నిర్ధారణ అయితే గాని బ్రిడ్జ్ పనులు చేపట్టలేదు. ఈ తతంగం అంతా రెండు నెలలు పట్టే అవకాశాలున్నాయి. అప్పటి వరకు బ్రిడ్జ్ నిర్మాణ పనులు ముందుకు సాగేది లేదు. ప్రస్తుతం ఎర్రసత్యం స్మారక బస్టాప్ వద్ద డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. అందుకు వర్షాలు అడ్డంకిగా మారాయి. రైల్వేలైన్‌కు ఇరువైపులా ఎల్ఐసీ కార్యాలయం నుంచి హైస్కూల్, శ్రీకర బేకరి నుంచి సెయింట్‌ఆగ్నేస్ స్కూల్ కాంప్లెక్స్ వరకు రహదారి సిద్ధం చేశారు. దీనిపై బీటీ వేయాల్సి ఉంది.

రాత్రిళ్లు, ఉదయం దుమ్ముతో అవస్థలు

బీటీ వేసేందుకు సిద్ధం చేసిన రోడ్డుపై నుంచి రాత్రిళ్లు, ఉదయం 8.30గంటల వరకు దుమ్ముతో పట్టణవాసులు అవస్థలు పడుతున్నారు. దుమ్ము లేవకుండా పగటిపూట నీళ్ల చల్లుతున్నప్పటికీ రాత్రిళ్లు, ఉదయం పట్టించుకోకుండా ఉన్నారు. దీంతో నీళ్ల చల్లే వరకు ఇబ్బందులు తప్పటం లేదు. వాస్తవానికి రోడ్డుపై రాత్రిళ్లు పెద్ద సంఖ్యలో లారీలు ప్రయాణిస్తుంటాయి. భారీ వాహనాలతో దుమ్ము అధికంగా వస్తుండటంతో రోడ్డు పొడుగునా ఇళ్లు, వ్యాపార సంస్థలు ఉన్న వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అనుమతులు వస్తేనే బ్రిడ్జి పనులు

రైల్వేలైన్‌పై బ్రిడ్జ్ నిర్మాణం కోసం అంతా సిద్ధంగా ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వేశాఖ నుంచి అనుమతులు వస్తేనే బ్రిడ్జ్ పనులు ప్రారంభమవుతాయి. కరెంట్ లైన్ ఉన్నందున పనులు చేయాలంటే ఆ శాఖ అనుమతులు తప్పనిసరి. ఇప్పటికైతే పిల్లర్లు వేసి బ్రిడ్జ్‌వేసేందుకు కాంట్రాక్టరు అంతా సిద్ధం చేశారు. అలాగే పదిరోజులు వర్షాలు పడకుండా ఉంటేనే వేసిన రోడ్డుపై బీటీ పనులు ముందుకు సాగుతాయి.

– రవికుమార్, ఏఈ, జాతీయ రహదారుల శాఖ

మానసిక రోగులను గుర్తించాలి


నాటక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పాలమూరు: ఆత్మహత్యలను నివారించవచ్చునని, మానసిక సమస్యలను గుర్తించి వాటికి సరిపడ వైద్య కౌన్సిలింగ్ తీసుకోవాల్సి ఉంటుందని ఎస్వీఎస్ ఆస్పత్రి మానసిక వైద్య విభాగం హెచ్‌వోడీ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్వీఎస్‌లో మానసిక ఆరోగ్యం–ఆత్మహత్య నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక రోగులను సకాలంలో గుర్తించడంతో పాటు తగిన చికిత్స చేయడం వల్ల ఆత్మహత్యలను చాలా వరకు నివారించగలుగుతామన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వ్యక్తులు సాయం కోరే విధంగా భయపడకుండా ముందుకు రావడానికి సహాయక వాతావరణం సృష్టించాలన్నారు. ఆ తర్వాత మానసిక ఆరోగ్యంపై ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రత్యేక నాటకం ద్వారా ఒత్తిడి, ఆందోళన ఎదుర్కొనే వ్యక్తులు ఎలా ఉంటారో ప్రదర్శించి చూపించారు. అదేవిధంగా ఆత్మహత్యల నుంచి నివారించడానికి ఎలా సహకరించాలో నాటకం చేసి చూపించారు. దీంతో పాటు నర్సింగ్ విద్యార్థులు మైమ్ ప్రదర్శన ద్వారా మానసిక సమస్యలతో బాధపడే వ్యక్తులు ఎదుర్కొనే భావోద్వేగాలను నాటకం ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, వెంకట్ రాహుల్, భార్గవ్ స్వరాజ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో నెల రోజుల కిందట జరిగిన చోరీ కేసులో నిందితుడు చంద్రశేఖర్‌ను మంగళవారం కోర్టులో హాజరు పర్చగా.. జడ్జి 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలియజేశారు. అంబట్‌పల్లికి చెందిన కృష్ణారెడ్డి ఇంట్లో జరిగిన చోరీలో ఎత్తుకెళ్లిన బంగారాన్ని రికవరీ చేశామని వివరించారు.


డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.10 వేల జరిమానా


కూల్ డ్రింక్ లోడ్‌తో తెల్కపల్లి నుంచి లింగాల వైపు వెళ్తున్న లారీని మండల పరిధిలోని సూరాపూర్ వద్ద సోమవారం తనిఖీ చేశామని ఎస్ఐ తెలిపారు. డ్రైవర్ రవి తాగిన మత్తులో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతున్నాడన్నారు. అతనిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి మంగళవారం అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి రూ.10 వేల జరిమానా విధించినట్లు వివరించారు.

ఆటో బోల్తా: నలుగురు విద్యార్థులకు గాయాలు

వనపర్తి రూరల్: ఆటో బోల్తా పడి నలుగురు విద్యార్థులకు గాయాలైన సంఘటన మంగళవారం పెబ్బేరు ఎన్‌హెచ్ 44పై చోటుచేసుకుంది. స్థానికులు తెలపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మోడల్ పాఠశాల నుంచి ఆటోలో ఏడుగురు విద్యార్థులు ఇంటికి వెళ్తున్నారు. పెబ్బేరు పట్టణ శివారులోని బాలాజీ దాబా దాటిన తర్వాత ఎన్‌హెచ్44పై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థుల్లో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. గాయాలైన వారిని పెబ్బేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మోడల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సరిపడా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అశ్రునయనాల మధ్య శ్వేతారెడ్డి అంత్యక్రియలు


శ్వేతారెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు


శ్వేతారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

- మాజీమంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- అంతిమయాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

జడ్చర్ల: మాజీమంత్రి లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి అకాల మరణం అటు జడ్చర్ల, ఇటు నాగర్‌కర్నూల్ అసెంబ్లీల పరిధి ప్రజలను ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసింది. శ్వేతారెడ్డి పార్థివదేహాన్ని చెన్నై నుంచి అంబులెన్స్‌లో రోడ్డు మార్గాన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలోని స్వగృహానికి మంగళవారం ఉదయం తరలించారు. అప్పటికే అక్కడికి భారీగా జనం చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవంచకు చేరుకుని అంతిమసంస్కారాల్లో పాల్గొన్నారు. అలాగే ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామరెడ్డి, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రజనీ సాయిచంద్ తదితరులు ఆవంచకు చేరుకుని శ్వేత పార్థివ దేహానికి నివాళులర్పించి అంతిమ వీడ్కోల్‌లో పాల్గొన్నారు. కన్నీరు మున్నీరై విలపించిన లక్ష్మారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. లక్ష్మారెడ్డి పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడు స్వరణ్‌రెడ్డి చితికి నిప్పంటించగా వేలాది మంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు.